నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
శనివారం | 01 మార్చి 2025 | పేజీలు 8

### శ్రీశైలంలో శాస్త్రోక్తంగా
# బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి

- చండీశ్వరునికి త్రిశూల స్నానం, ధ్వజ అవరోహణ కార్యక్రమం
- నేడు స్వామి అమ్మవార్లకు అశ్వవాహన సేవ,పుష్పోత్సవం, శయనోత్సవం


పుష్కరిణిలో చండీశ్వర స్వామికి త్రిశూల స్నానం

**శ్రీశైలం,మేజర్ న్యూస్:**మహా శివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకుని నవాహ్నిక దీక్ష తో ఈనెల ఈ నెల 19వ తేదీన ప్రారంభించిన శ్రీశైల మల్లన్న బ్రహ్మోత్సవ యాగాలకు శుక్రవారం శాస్త్రోక్తంగా పూర్ణాహుతి నిర్వహించారు. యాగ శాలలో వేదపండితులు ఉత్సవ మిగతా 6లో

### రాష్ట్ర బడ్జెట్ పై
- ప్రజారంజక బడ్జెట్ అంటూ కూటమి పార్టీలు హర్షం
- ప్రజలను మోసం చేసిన అంకెల బడ్జెట్ అంటూ ప్రతిపక్షాలు విమర్శ

# మోదం..ఖేదం..

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో 2025-26 వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం ప్రవేశపెట్టారు. రూ.3.22లక్షల కోట్లతో బడ్జెట్‌ను సభ ముందుకు తీసుకొచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ ఇది. ఈ రాష్ట్ర బడ్జెట్‌పై అధికార కూటమి పక్షాలు హర్షం ప్రకటించగా విపక్షాలు మాత్రం అసంతృప్తి,విమర్శలు గుప్పించాయి. ఈ బడ్జెట్ వికసిత భారత్ లో స్వర్ణాంధ్రను భాగస్వామ్యం చేసేలా బడ్జెట్ ఉందని అన్ని రంగాలకు ప్రాధాన్యత కల్పించారని కూటమి పార్టీలు మోదం తెలుపగా,రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం అంకెలు మాత్రమే కనబడుతున్నాయని ఎన్నికల హామీలఅమలుపై ఎక్కడ స్పష్టత లేదని ప్రజలను మిగతా 2లో


ఏపి బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** ఉమ్మడి జిల్లా ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వాన్ని కోరింది కొండంత అయితే రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాత్రం నిధుల కేటాయింపులో చేతులు విదిలించారు. జిల్లాకు 850 కోట్ల రూపాయలు అవసరమంటూ జిల్లా అధికారులు ప్రతిపాదించారు. అయితే శుక్రవారం అసెంబ్లీలో పయ్యావుల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 326 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారు. 2019 ఎన్నికలకు ముందు కర్నూలు జిల్లాలో వేదవతి, ఆర్డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టుల నిర్మాణానికి అనుమతులిచ్చి నిధులు విడుదల చేసిన చంద్రబాబు ప్రభుత్వం 2024లో అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుల ఊసే ఎత్తకపోవడం చూస్తుంటే ఆ ప్రాజెక్టులను అటకెక్కించినట్లేనన్నది స్పష్టమవుతోంది. మిగతా 2లో

## అడిగింది రూ.850 కోట్లు..
# ఇచ్చింది రూ.326 కోట్లు..

- ఉమ్మడి జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులో మిగిలిన నిరాశ..
- బడ్జెట్‌లో కనిపించని వేదవతి,ఆర్డీఎస్,గుండ్రేవుల ప్రాజెక్టుల మాట
- 68 చెరువులకు నీటిని నింపేందుకు మాత్రమే బాగా నిధులిచ్చిన పయ్యావుల
- యూనివర్సిటీకు అంతంత మాత్రంగానే నిధులు



### ఆర్థిక ఇబ్బందులు ఉన్నా..
## అభివృద్ధికి బాటలు వేసే బడ్జెట్

- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్

**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :** అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. బడ్జెట్‌పై మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. సూపర్ సిక్స్ మిగతా 2లో


మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి టీజీ భరత్

# భక్తజన సందోహం మధ్య పార్వతీ పరమేశ్వరుల రథోత్సవం


అశ్వ వాహనం పై విహరించిన స్వామివార్లు

మహానంది క్షేత్రంలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్యక్షేత్రంలో శ్రీ గంగా కామేశ్వరి సమేత మహానందీశ్వర స్వామి రథోత్సవం అశేష భక్త జన సందోహం ఓంకార నామస్మరణల మధ్య అత్యంత వైభవంగా సాగింది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకొని శుక్రవారం సాయంకాలం నిర్వహించిన రథోత్సవానికి భక్తులకు వేలాదిగా తరలి వచ్చారు. మిగతా 6లో

### రాష్ట్ర ప్రగతికి
## ఊతమిచ్చేలా బడ్జెట్

- రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖా మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి

**బనగానపల్లెమేజర్,న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశపెట్టిన తొలి పూర్తిస్థాయి బడ్జెట్ రాష్ట్ర ప్రగతికి ఊతమిచ్చేలా ఉందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి తెలిపారు. అభివృద్ధి , సంక్షేమాల కలబోతగా బడ్జెట్‌ను రూపొందించడంతో బడ్జెట్ కేటాయింపుల్లో సమతుల్యత కనిపించిందన్నారు. మిగతా 2లో


మాట్లాడుతున్న మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి

# నేడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాక

- ఏర్పాట్లను జిల్లా అధికారులు,జిల్లా టీడీపీ నాయకులు పరిశీలన
- ఏర్పాట్ల పై శ్రీ మఠం పీఠాధిపతులు,అధికారులు,నాయకుల చర్చ

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో జరగనున్న గురువైభోత్సవాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ శనివారం మంత్రాలయంకు విచ్చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య, టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి,కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మిగతా 6లో


పీఠాధిపతితో చర్చిస్తున్న టీడీపీ నాయకులు

# అడిగింది రూ. 850 కోట్లు.. ఇచ్చింది రూ.326 కోట్లు..

(మొదటి పేజి తరువాయి)

బడ్జెట్‌లో ఆయా ప్రాజెక్టులకు కేటాయించిన నిధుల్లో ఎక్కువ శాతం జీతాలకే సరిపోయేటట్లున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు కంటి తుడుపుకేనన్నది స్పష్టమవుతోంది. హెచ్ఎన్ఎస్ఎస్ నుండి కర్నూలు జిల్లా పశ్చిమ భాగంలోని 68 చెరువులకు నీటిని నింపే ప్రాజెక్టుకు మాత్రమే చెప్పుకోతగిన విధంగా కేటాయింపులు చేశారు. ఈ పనులకు 46 కోట్ల రూపాయలు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించగా, ప్రభుత్వం 37 కోట్ల రూపాయలు కేటాయించింది. ఇందులో మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు కూడా కేటాయింపులున్నాయి.

తుంగభద్ర బోర్డుకు పయ్యావుల 299 కోట్ల రూపాయల అత్యధిక నిధులు విడుదల చేశారు. అయితే, ఈ నిధులు లైనింగ్ పనులకు సంబంధించిన పెండింగ్ బిల్స్ చెల్లించేందుకేనని బడ్జెట్‌లో స్పష్టంగా పేర్కొనడం గమనార్హం. తుంగభద్ర డ్యాం వద్ద ఇటీవలే గేట్ ఒకటి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. నీరు వృధా కాకుండా స్టాప్ లాక్‌ను యుద్ధప్రాతిపదికన అమర్చిన విషయం తెలిసిందే. అప్పట్లోనే గేట్ల నిర్వహణకు పెద్ద ఎత్తున నిధులు అవసరమవుతాయని ప్రతిపాదించారు. అయితే, ఈ బడ్జెట్‌లో ఆ ఊసు కనిపించలేదు. శ్రీశైలం డ్యాం నిర్వహణకు 58 కోట్ల రూపాయలు అవసరమవుతాయని ప్రతిపాదించగా, 31 కోట్ల రూపాయలను మంజూరు చేశారు. ఎల్ఎల్‌సి ఆధునికీకరణ, వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులకు 313 కోట్ల రూపాయలు అవసరమవుతాయని ప్రతిపాదించగా, ఎల్ఎల్‌సికి 30 కోట్ల రూపాయలు మాత్రమే ఇచ్చారు. కర్నూలు-కడప కాలువకు 235 కోట్ల రూపాయలు అవసరమని ప్రతిపాదించగా, 183 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. ఈ నిధుల్లో సింహభాగం కుందూనది విస్తరణకు వినియోగించనున్నారు. ఎస్సార్బీసికి 89 కోట్ల రూపాయలు అవసరమవుతాయని ప్రతిపాదిస్తే కేవలం 5.52 కోట్ల రూపాయలు మాత్రమే ఇచ్చారు. గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకానికి 57 కోట్ల రూపాయలు అవసరమవుతాయని ప్రతిపాదించగా, 34.60 కోట్ల రూపాయలు విడుదల చేశారు. ఇందులో 10 కోట్ల రూపాయలు అభివృద్ధి పనులకు, 24.60 కోట్ల రూపాయలు విద్యుత్ ఛార్జీలు చెల్లించేందుకు కేటాయించారు. గాజులదిన్నె ప్రాజెక్టుకు 35 కోట్ల రూపాయలు కోరితే 12 కోట్లు, సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి 10.24 కోట్ల రూపాయలు, అవుకు రిజర్వాయర్‌కు 40 కోట్ల రూపాయలు అవసరమని ప్రతిపాదిస్తే వచ్చింది కేవలం 3 కోట్ల రూపాయలు మాత్రమే. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి 300 కోట్ల రూపాయలు అవసరమవుతాయని కోరితే కేవలం 2 కోట్ల రూపాయలు ఇచ్చారు. ఈ పథకం వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రారంభమైంది. రాయలసీమ దుర్భిక్ష నివారణ పథకం పేరుతో 44 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని వైకాపా ప్రభుత్వం చెప్పింది. ప్రస్తుత తెదేపా ప్రభుత్వం దుర్భిక్ష నివారణ పథకాన్ని పక్కన పెట్టి గోదావరి జలాలను బానకచర్లకు తరలించే ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇస్తోన్న విషయం తెలిసిందే.

**యూనివర్శిటీలకు అంతంత మాత్రంగానే :** ఉమ్మడి కర్నూలు జిల్లాలోని యూనివర్శిటీలకు కూడా ఈ బడ్జెట్‌లో కేటాయింపులు అంతంత మాత్రంగానే కనిపిస్తున్నాయి. రాయలసీమ యూనివర్శిటీకి 13 కోట్ల రూపాయలు, క్లస్టర్ యూనివర్సిటీకి 1.20 కోట్ల రూపాయలు, ఉర్దూ యూనివర్శిటీకి 3.39 కోట్ల రూపాయలు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల తన బడ్జెట్‌లో కేటాయించారు. 68 చెరువులు నింపే పనులకు నిధుల కేటాయింపులో పెద్ద మనసును ప్రదర్శించిన పయ్యావులతన బడ్జెట్‌లో ఆర్డీఎస్, గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టుల ఊసే ఎత్తకపోవడం చూస్తుంటే వాటికి ప్రస్తుత ప్రభుత్వ ప్రాధాన్యతలేమిటన్నది స్పష్టమవుతోంది.

### ఆర్థిక ఇబ్బందులు ఉన్నా..

## అభివృద్ధికి బాటలు వేసే బడ్జెట్

(మొదటి పేజి తరువాయి)

హామీలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ కేటాయించారన్నారు. అన్ని శాఖలకు ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్‌లో నిధులు కేటాయించారని చెప్పారు. ప్రధానంగా ఇండస్ట్రీయల్ డిపార్ట్‌మెంట్‌కు రూ.3,156 కోట్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రభుత్వం సంక్షేమం అందించడంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథం దిశగా ముందుకు తీసుకువెళుతుందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు కృషి చేయడంతోపాటు యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. బడ్జెట్ రూపకల్పనలో సీఎం చంద్రబాబు దార్శనికత స్పష్టంగా కనిపిస్తుంది అన్నారు.

## రాష్ట్ర ప్రగతికి ఊతమిచ్చేలా బడ్జెట్

(మొదటి పేజి తరువాయి)

అఖండ మెజార్టీతో గెలిపించిన ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం సంతోషకరమన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు నిధులు కేటాయింపుల ద్వార ప్రజలకు ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు సూపర్‌సిక్స్ అములులో ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధికి నిదర్శనమని రాష్ట్రం పెట్టుబడులను ఆకర్షించేలా మౌళిక సదుపాయాల కల్పనకు ఊతమిచ్చేలా బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో రోడ్లన్ని అధ్వాన్నంగా మారడంతో ప్రజలు ఐదేళ్లపాటు నరకయాతన అనుభవించారని కూటమి ప్రభుత్వం వల్ల అధికారంలోకి వచ్చిన తరువాత గుంతలరహిత రోడ్లే లక్ష్యంగా 90శాతం పైగా రోడ్ల మరమ్మత్తులు మూడు నెలల కాలంలో చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రహదారులు, వంతెనల పునఃనిర్మాణం ప్రాజెక్టుల కింద 2525కిలోమీటర్ల రహదారుల విస్తరణ పనులు 464 వంతెనలు నిర్మాణం, రాష్ట్రంలో రహదారుల వంటి కీలక రంగాల్లో మౌళిక సదుపాయల కల్పనకు పెట్టుబడులను ఆకర్షించేందుకు టూరిజం వంటి రంగాల అభివృద్ధికి దోహద పడుతుందన్నారు.

# రాష్ట్ర బడ్జెట్‌పై మోదం..ఖేదం..

(మొదటి పేజి తరువాయి)

మోసం చేసిన బడ్జెట్ అని ప్రతిపక్షాలు ఖేదం తెలిపాయి. రాయలసీమతో పాటు జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడంపై ప్రతిపక్షాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. రాష్ట్ర బడ్జెట్‌పై అధికార,ప్రతిపక్ష నాయకుల స్పందన ఇలా వున్నాయి.



తిక్కారెడ్డి,జిల్లా అధ్యక్షులు

**ఇది ప్రజారంజక బడ్జెట్ :- తిక్కారెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు :** కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ ప్రజారంజకంగా ఉంది. అన్ని రంగాలకు సమప్రాధాన్యతని స్తూ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కేటాయింపులు జరిపారు. వైసిపి ప్రభుత్వంలో రాష్ట్ర ఆర్థిక రంగం దెబ్బతిన్నా కోలుకోలేని స్థితిలో ఉన్నప్పటికీ బడ్జెట్ అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం హర్షణీయం. సూపర్‌సిక్స్ హామీల అమలుపై అత్యధిక నిధులు కేటాయించారు.


పార్థసారథి, ఆదోని ఎమ్మెల్యే

**బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రతిభింబించాయి : బిజెపి నాయకులు, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి** : అభివృద్ధి,సంక్షేమం రెండు కళ్లులాగ రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతిభింబించాయి. విద్య, వైద్య, వ్యవసాయం, అభివృద్ధి,సామాజిక సంక్షేమ ప్రాధాన్యతతో వికసిత భారత్‌లో స్వర్ణాంధ్రను భాగస్వాములు చేసే బడ్జెట్ ఇది. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచేవిధంగా బడ్జెట్ రూపకల్పన జరిగింది. గత ఐదేళ్లుగా జగన్ పాలన విధ్వంసం వల్ల తలకు మించిన భారంతో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రతిపక్ష హోదా కోరుతూ వైఎస్ జగన్ బడ్జెట్ ప్రవేశపెట్టేరోజున బాధ్యతారహితంగా మొహం చాటేశారు.


ఎస్‌వి మోహన్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు

**బడ్జెట్‌లో ప్రజలకు పంగనామాలే : ఎస్‌వి మోహన్ రెడ్డి,వైసిపి జిల్లా అధ్యక్షులు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ అంతా అంకెల గారడిలా ఉంది. ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో హామీల అమలుపై చిత్తశుద్ధి చూపలేదు. తల్లికి వందనం,దీపం పథకం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలకు బడ్జెట్ కేటాయింపులు తగ్గించడం విడ్డూరం. ఎన్నికల హామీలపై ప్రజలకు పంగనామాలు పెట్టేలా ఆర్థిక శాఖ మంత్రి బడ్జెట్ ప్రవేశపెట్టారు. మహిళలకు ఉచిత బస్సు హామీపై కనీసం ఊసెత్త లేదు. గత వైసిపి ప్రభుత్వంలో అన్ని వర్గాలను ఆదుకునేలా బడ్జెట్ రూపకల్పన జరిగేది. బడ్జెట్‌లో సూపర్‌సిక్స్ హామీల అమలుకు కేటాయింపుల కోతలు విధించినప్పటికీ అప్పులు మాత్రం విపరీతంగా చేశారు.


గిడ్డయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి

**బడ్జెట్‌లో జిల్లాకు తీరని అన్యాయం : బి గిడ్డయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి :** రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రూ.3.22లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో సూపర్ సిక్స్ పథకాలకు కొంత ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ కర్నూలు జిల్లాకు మొండి చేయి చూపి తీరని అన్యాయం చేశారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులైన వేదావతి, ఆర్‌డిఎస్ కుడికాలువ,గుండ్రేవుల రిజర్వాయర్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం బాధాకరం. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేస్తానని హామీ ఇచ్చారని అయితే బడ్జెట్‌లో కేటాయింపులు చేయకపోవడం బాధాకరమన్నారు. బడ్జెట్‌లో సవరణలు చేసి పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలి.


గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి

**ఎన్నికల హామీలను విస్మరించిన బడ్జెట్ : గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి :** రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవకు అరకొర నిధులు కేటాయించడం తప్ప సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం కోసం ఎటువంటి ప్రతిపాదనలు ఈ బడ్జెట్‌లో లేకపోవడం రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేయడమే. సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.11,314కోట్లు కేటాయించడం అంటేనే వ్యవసాయం పట్ల ఈ ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుంది. జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టు గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం గతంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడమే. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ గురించి మాట మాత్రం కూడా చెప్పకుండ మభ్యపెట్టే ప్రయత్నం చేశారు.

**తొలి బడ్జెట్ సంఖ్య ఘనం.. కేటాయింపులు మాత్రం శూన్యం.. నంద్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు మరియు ఏఐసీసీ మెంబర్ జంగిటి లక్ష్మి నరసింహ యాదవ్ : (నంద్యాలటౌన్, మేజర్‌న్యూస్ :)** శుక్రవారం అసెంబ్లీ లో ప్రవేశపెట్టిన 2025 బడ్జెట్లో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలకు రైతంగానికి నిరుద్యోగులకు సరైన బడ్జెట్ కేటాయించకపోవడం అంకెల గారడి బడ్జెట్‌గా అభివర్ణిస్తున్నామని


లక్ష్మి నరసింహా యాదవ్

కాంగ్రెస్ నంద్యాల పార్లమెంటు జిల్లా డిసిసి అధ్యక్షులు మరియు ఏఐసిసి మెంబర్ లక్ష్మి నరసింహ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం లక్ష్మి నరసింహా యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్ సంఖ్య ఘనం కేటాయింపులు శూన్యమంటూ గుప్పించారు. అంతా అంకెల గారడి అని - అభూత కల్పనగా చెప్పుకొచ్చారు. దశ - దిశ లేని.. పస లేని బడ్జెట్ ఇది అంటూపేర్కొన్నారు. రాష్ట్రం గుల్ల.. బడ్జెట్ అంతా డొల్ల అనిఅన్నారు.ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా, ఎన్నికల వాగ్దానాలను పూర్తిగా విస్మరించారన్నారు. సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు పెట్టారంటూ మండిపడ్డారు. ఇతర హామీలకు ఎగనామం పెట్టారని అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కాదని.. ముంచే ప్రభుత్వం అని తొలి బడ్జెట్‌తనే నిరూపితం అయ్యిందని తెలిపారు. సూపర్ సిక్స్ -సూపర్ ఫ్లాప్ అంటూ దుయ్యబట్టారు. అన్నదాత సుఖీభవ పథకానికి కేవలం రూ.6,300 కోట్లు కేటాయించడం అరకొరనే అని అన్నారు. రాష్ట్రంలో 54 లక్షల మంది రైతులు ఎదురుచూస్తుంటే రూ.11 వేల కోట్లు నిధులు కావాల్సి ఉంటే.. కేంద్రం ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్ కోసం రైతులను నిరీక్షణకు గురి చేయడం అన్యాయమన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతుంటే ..ముష్టి రూ. 300 కోట్లు ధరల స్థిరీకరణ నిధికి ఇవ్వడం ద్రోహమే అని అన్నారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసి , ఎన్నికల హామీలను గాలికి వదిలేసి మసి పూసి మారేడు కాయ చేశారన్నారు.ఈ బడ్జెట్‌లో విజన్ లేదని.. విజ్ఞం లేదని.. కేవలం ఇంద్రజాలమే అన్నారు. మిషన్ లేదు మీనింగ్ లేదు కేవలం మహేంద్రజాలమే అంటూ పేర్కొన్నారు.

**పాస్‌పోర్ట్ పోయినది**

సాధు అనిరుధ్ రెడ్డి S/o రవి శంకర్ రెడ్డి సాధు, R/o ఇ.నెం. 39-7-బి1, కెవిఆర్ గార్డెన్, వడ్డేగేరి సమీపాన, కర్నూలు పిన్: 518001, ఆంధ్ర ప్రదేశ్ అను నా యొక్క T1119904 నెం. కలిగిన ఒరిజినల్ ఇండియన్ పాస్‌పోర్ట్, 17.02.2025 తేదీన, నేను నా ద్విచక్ర వాహనంపై కర్నూలులోని పార్కు రోడ్డు నుంచి ప్రకాష్ నగర్‌కు వెళు తుండగా పోయినది. ఎవరికైన దొరికినచో పై చిరునామలో ఇవ్వగలరు లేదా మొబైల్ నెం. 8247482022కు సంప్రదించ గలరు.

# భక్తులతో కలకలలాడిన మహానంది క్షేత్రం

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్య క్షేత్రం అశేష భక్త జన సందోహంతో కలకలలాడింది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం పలు రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయంలోని పుష్కరిణిలలో పుణ్య స్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వరస్వామివార్లను దర్శించు కున్నారు. దాదాపు రెండు గంటల పాటు క్యూలైన్‌లలో వేచి ఉండి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.



# సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలి

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** నంద్యాల శాంతి రాం ఇంజనీరింగ్ కళాశాలలో సిగ్మా 14వ జాతీయ స్థాయి సాంకేతిక సమ్మేళనం అంగరంగ వైభవంగా జరిగింది. శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన సమ్మేళనంలో విద్యార్థులకు ఒక విశిష్ట వేదికను అందించడమే కాకుండా వారి సాంకేతిక నైపుణ్యాలను, సృజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను ప్రదర్శించే అరుదైన అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. ఎమ్మినెన్స్ అనే థీమ్‌తో రూపుదిద్దుకున్న ఈ ఏడాది సమ్మేళనం నూతన ఆవిష్కరణలు, పరిశోధన అభివృద్ధికి ప్రేరణగా నిలిచింది. గౌరవ అతిథులుగా డాక్టర్ అశోక్‌కుమార్, ఆర్‌జీఎం విద్యాసంస్థల డైరెక్టర్ పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి శాంతిరాం గ్రూప్ సంస్థల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.




**జాతీయస్థాయి సాంకేతిక సమ్మేళనంలో మాట్లాడుతున్న ఆర్‌జీఎం చైర్మన్ శాంతిరాముడు**

ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని తెలిపారు. భూమి సూర్యుని చుట్టూ తిరిగే ప్రక్రియ ద్వారా శక్తిని ఉత్పత్తి చేయగలమా అనే ప్రశ్నను తన విద్యార్థి దశలో ఉస్మాయా విశ్వవిద్యాలయంలో తన ప్రొఫెస ర్‌ను అడిగిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం శాస్త్రవేత్తలు భూమి గమనాన్ని ఉపయో గించి శక్తిని ఉత్పత్తి చేయగలమని నిర్ధారించారని తెలిపారు. విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించి కొత్త ఆవిష్కరణలకు పునాది వేయాలని ఆయన సూచించారు. ఈరెండు రోజుల సాంకేతిక సమ్మేళనంలో సాంకేతిక ఈవెంట్లు, కళా, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక ఆకర్షణగా 20 వ్యాపార ప్రదర్శన స్టాళ్లు ఏర్పాటు చేయబడ్డాయి. విద్యార్థులు ఈ స్టాళ్ళ ద్వారా తమ వ్యాపార ఆలోచనలను ప్రదర్శించి పరిశ్రమ నిపుణుల అభిప్రాయాలను సేకరించారు. ఈకార్యక్రమానికి కన్వీనర్లు డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ శేషయ్య, సహ కన్వీనర్లు డాక్టర్ సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.

# మస్తానయ్య దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**చిప్పగిరి, మేజర్ న్యూస్ :** మండలంలోని నంచర్ల గ్రామంలో వెలసిన శ్రీ మస్తానయ్య స్వామి 39 వ ఉరుసు సందర్భంగా ఎమ్మెల్యే విరుపాక్షి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారు కొలిచిన వారికి కొంగు బంగారం లా కోరిన కోర్కెలు తీర్చారని అన్నారు. దర్గాలు కుల మతాలకు అతీతంగా నిర్వహిస్తారని మత సామరస్యాలకు ప్రతీక అని తెలిపారు.కార్యక్రమంలో వైసీపీ సర్పంచ్ లు,ఎంపిటిసి లు,నాయకులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ చిన్నకు ఘన సన్మానం



**ఆదోని, మేజర్ న్యూస్ :** ఆదోని మున్సిపాలిటీ 18వ వార్డు ఎం ఎం కాలనీ కౌన్సిలర్ చిన్న ఆదోని దక్షిణ మండల ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సంద ర్భంగా బిజెపి పార్టీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మా వార్డు తోపాటు దక్షిణ మండలంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేసి ఎమ్మెల్యే పార్థన్న ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. నా మీద నమ్మకంతో భారతీయ జనతాపార్టీ ఉపాధ్యక్షులుగా నియమించిన ఎమ్మెల్యే పి.వి. పార్థసారథికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు అమరావత నగర్ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ, చిన్న పెండేకల్లు సర్పంచ్ చిలక జయరాం, ధణాపురం సర్పంచ్ చంద్రశేఖర్, కల్లుపోతుల సురేష్, రంగన్న యాదవ్, గోనబావి మాజీ ఎంపిటీసీ గోవిందు, రంగస్వామి, వెల్లాల మధుసూదన శర్మ, రాజా, తదితరులు పాల్గొన్నారు.

# గాడిచెర్ల ఆశయాల సాధన కోసం పని చేద్దాం



**గాడిచెర్ల విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం**

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** ఆంధ్ర తిలక్ బిరుదాంకితుడు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం, గాడిచెర్ల కమిటీ సభ్యులు, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రఘురాముడు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు 66వ వర్ధంతిని గాడిచెర్ల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. తదనంతరం వారు మాట్లాడుతూ వందేమాతరం ఉద్యమాన్ని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఉధృతం చేసిన మహానీయులు, ఊరురా తిరుగుతూ గ్రంథాలయాలు ఏర్పాటు చేసిన ఉద్యమ పితామహుడు, వయోజన విద్యను రాత్రి బడులుగా మార్చి గొప్ప అక్షజ్ఞానం నేర్పిన మహానుబావులు అని, ఆయన సేవలను స్మరించుకుంటూ వర్ధంతిని జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. గ్రంథాలయ అధికారిణి సుమలత, మెడికల్ స్టోర్ రాము, జనసేన నాయకులు షాలూబాష, నాయకులు సుల్తాన్ మోహిద్దీన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఖలీలుల్లాఖాన్, నాగేశ్వరయాదవ్, ఖలీల్, భరత్, రంగయ్య, పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వార్షికోత్సవం

**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** బేతంచెర్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవంను శేషారెడ్డి హై స్కూల్ ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రహిమాన్ ,స్కూల్ కరెస్పాండంట్ నాగ భూషణ రెడ్డి,ఎంఇఓ సోమశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో మాజీ ఆర్థికశాఖామంత్రి బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి చొరవతో బేతంచెర్లలో నూతన పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభం చేశారని అన్నారు.. మెకానికల్ విభాగాలలో ప్రస్తుతం 330 మంది విద్యార్థులు చదువుతున్నారు. నూతన భవనం లేనందున విద్యార్థుల సౌకర్యం కోసం శేషారెడ్డి స్కూల్ భవనంలో తరగతులు నిర్వహించుకునే వసతి కల్పించామని స్కూల్ కరెస్పాం డంట్ తెలిపారు. ఎంపిడిఓ మాట్లాడుతూ విద్యార్థులు విద్య తో పాటు ఇతర విషయాలపై కూడా పట్టు సాధించాలని సూచించారు. పాలిటెక్నిక్ లో చేరడం ఒక మంచి అవకాశమని, పిన్న వయసులోనే ఉద్యాగం సంపాదించే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ మాట్లాడుతూ మొదలైన 2 సంవత్సరా ల్లోనే విద్యార్థులు మంచి ప్రతిభను చూపిస్తున్నారని స్టేట్ ర్యాంక్ సాధించారని సిబ్బంది అందరూ అంకిత భావంతో పనిచేస్తున్నారని కొనియాడారు.



# ఇ-క్రాఫ్, ఇ-కేవైసీలో జిల్లాలో వెలుగోడు మొదటి స్థానం



**మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ**

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో వ్యవసాయ అధికారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ రైతు సేవా కేంద్రం సిబ్బందికి సమీక్షా సమావేశాన్ని, సామర్థ్య పెంపు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ ఇ- క్రాప్ నమోదు, ఇ-కేవైసీ నందు జిల్లాలో వెలుగోడు మొదటి స్థానంలో ఉన్నందున సిబ్బందిని అభినందించారు. పీఎం కీసాన్ లబ్ధిదారులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను 52 శాతం పూర్తి చేశారని, మిగిలిన వారిని త్వరగా రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేయాలని సిబ్బందిని ఆయన కోరారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది ఎల్లవేలలా రైతులకు అందుబాటులో ఉండి మరింత మెరుగైన పని తీరును కనబర్చాలని ఆయన తెలిపారు. వ్యవసాయ విస్తరణ సిబ్బంది సుధారాణి, అంజిత్‌కుమార్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# శివ నందిలో గాడిదల పందేలు

**బండి ఆత్మకూరు రూరల్, మేజర్ న్యూస్ :** మహా శివరాత్రి పురస్కరించుకొని శివనంది క్షేత్రంలో స్థానిక టిడిపి నాయకులు మద్దిగారి బలరాముడు మద్దిగారి భూపాల్ ఆధ్వర్యంలో గాడిద ల పందేలు నిర్వహించారు.ఈ పందేలలో వేల్పనూరు కి చెందిన ఎల్లా నాగమయ్య గార్ధభం మొదటి స్థానంలో నిలిచింది. వెంగాల రెడ్డి పేట గ్రామానికి చెందిన బాల నరసయ్య గార్ధభం రెండో స్థానంలో, కడమలకాల్వ రజక సంఘానికి చెందిన గార్ధభం మూడో స్థానంలో నిలిచింది. గెలుపొందిన గార్ధబాలకు మొదటి బహుమతి 15000 రెండో బహుమతి 10000 మూడవది 5000 నిర్వాహ కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లికా ర్జున, పాపయ్య ఎల్లయ్య,చాకలి రమేష్ ,మద్దిలేటి ,పూల మధు, సుబ్బరాయుడు ,చాకలి సురేష్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# సూపర్ సిక్స్ పథకాలను అందిస్తానని ప్రజలకు భరోసా ఇచ్చిన చంద్రబాబు

**ఆలూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం 2025- 26 ఆర్థిక సంవత్సరానికి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 3,22,359 కోట్ల రూపాయలని ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రజల సంక్షేమానికి మరియు అభివృద్ధికి పెద్ద పేట వేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మెన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ,మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు లు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో ఏపీకి గుండె కాయ లాంటి పోలవరం కు నిధులు కేటాయించడం, బిసి,ఎస్సి, ఎస్టీ మరియు మైనార్టీ సామాజిక వర్గాలకు అధిక నిధులు, వ్యవసాయానికి మరియు గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేయడం,రోడ్లు విద్య,వైద్యంతో పాటు అమ్మకు వందనం,అన్నదాత సుఖీభవ లాంటి పథకాలకు నిధులు కేటాయించడం వల్ల ఇది రాష్ట్ర ప్రజలకు అనుకూలమైన బడ్జెట్ అని ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కు నా హృదయపూర్వక ధన్యవాదములు తెలుపుతున్నట్లు వారు తెలిపారు.



**మాట్లాడుతున్న వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మెన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ,**

**శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులు ఇలా..**

**ఎస్సీల సంక్షేమానికి రూ.20,281 కోట్లు,ఎస్టీల సంక్షేమానికి** రూ.8,159 కోట్లు,బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు,మైనార్టీల సంక్షేమానికి రూ. 5,434 కోట్లు,మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధులతో పాటు రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయించి సన్న,చిన్నకారు రైతులకు అండగా నిలిచారని అన్నారు.యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం చంద్రబాబు ఆశయం అన్నారు.



# తుంగభద్ర డ్యామ్‌కు 80 ఏళ్లు

- డ్యామ్ నిర్మాణంకు పునాదులు వేసి నేటికి 80 ఏళ్ళు పూర్తి..
- నాటి మద్రాసు,ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఆధ్వర్యంలో 1945లో పునాదులు..
- 1953 లో పూర్తి చేసి కర్ణాటక,తెలుగు రాష్ట్రాల ప్రజలకు నీటిని అందించిన వైనం
- నాడు డ్యామ్ పూర్తి స్థాయి నీటిమట్టం 132 టీఎంసిలు. నేడు 105.788 టీఎంసిలు.
- డ్యామ్ ఎత్తు1633 అడుగులు..
- టిబి డ్యామ్ ఫౌండేషన్ వేడుకలు నిర్వహించిన అధికారులు..

**ఆలూరు, మేజర్ న్యూస్ :** రాయలసీమ ప్రాంతంలో రైతులు పడుతున్న ఇబ్బందులు తాగునీటి ఇక్కట్లను గుర్తించిన నాటి బ్రిటీష్ కలెక్టర్ తెలుగు ప్రజల ఆరాధ్య దేవుడు సర్ ఆర్థర్ కాటన్ మద్రాసు రాష్ట్రం లోని సీమ జిల్లాలు అయిన బళ్లారి,కర్నూల్,కడప,అనంతపురం,హైదరాబాద్ ప్రాంతంలో ని వెనుకబడిన రాయచూరు,హెూస్పెట్ ప్రాంతాల రైతులను, ప్రజలను ఆదుకోవాలని వారికి సాగు,తాగునీరు తో సహా విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఉద్దేశంతో హెూస్పెట్ వద్ద డ్యామ్ నిర్మించాలని తలచారు. అయితే అప్పటి నవాబ్ లు,మద్రాస్ గవర్నర్ లు డ్యామ్ నిర్మాణానికి ఖర్చు ఎవరు భరించాలనే విషయం పై చర్చలు జరుగగా 1947లో భారతదేశానికి స్వాతంత్రం రావడం మద్రాసు,హైదరాబాద్ కు చెందిన ఇంజనీర్లు వేపా కృష్ణమూర్తి, పల్లి మల్లి పాపయ్య, మద్రాసు కు చెందిన తిరుమలే అయ్యంగార్ లు డ్యామ్ కు రూపకల్పన చేశారు. దేశంలో సిమెంట్ వాడకుండా కట్టిన డ్యామ్ లలో ఇది రెండోది కాగా మొదటి డ్యామ్ కేరళలో నిర్మించారు. స్వాతంత్ర్యం అనంతరం 1949 నుండి డ్యామ్ పనులకు శ్రీకారం చుట్టగా 1953న పూర్తి చేసి ప్రజలకు అందించారు. 1945 ఫిబ్రవరి 28న అప్పటి మద్రాసు గవర్నర్ సర్ ఆర్థర్ హెూప్ కుడి వైపు భూమి పూజ చేయగా బేరార్ కు చెందిన యువరాజు నవాబ్ అజం జీ ఎడమవైపు భూమి పూజ చేశారు. తుంగభద్ర నది పరివాహక ప్రాంతం 10,880 చదరపు మైళ్ళు కాగా వైశాల్యం 140 చదరపు మైళ్ళు గా అధికారులు తెలిపారు. అలాగే బహుళార్ధక సాధక ప్రాజెక్టుగా దీని నుండి 127 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడం ప్రారంభించారు. డ్యామ్ నిర్మాణం ద్వారా 200 గ్రామాలకు తాగునీరు ఎల్ ఎల్ సి ద్వారా ఒక లక్ష 80 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.దీన్ని నిర్మాణం మైసూర్ రాజ్యం లో నిర్మించిన కృష్ణ రాజ సాగర్ ఆనకట్ట రూపశిల్పి మంత్రి ప్రఖ్యాత ఇంజనీరు మోక్ష గుండం విశ్వేశ్వరయ్య సూచనలతో డ్యామ్ నిర్మాణం చేపట్టారు. డ్యామ్ కాంట్రాకర్ గా తెలంగాణ లోని మహబూబ్ నగర్ జిల్లా కోమారు గ్రామానికి చెందిన మూల మల్ల వెంకట రెడ్డి నియమించబడ్డారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్ నిర్మాణం వల్ల కర్ణాటక,ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలకు తాగునీరు,సాగునీరు అందుతుంది.అయితే డ్యామ్ పూర్తయి 70 ఏళ్ళు అయినా చెక్కుచెదరకుండా ఉన్న డ్యామ్ 2024 వరద నీటికి డ్యామ్ 19వ గేట్ పూర్తిగా వరదనీటిలో కొట్టుకొనిపోయింది.దీంతో కర్ణాటక,ఏపీ, తెలంగాణా ముఖ్యమంత్రి లు సిద్ధ రామయ్య,చంద్రబాబు,రేవంత్ రెడ్డి లు హుటాహుటిన డ్యామ్ నిర్మాణం లో అనుభవం గల ఇంజనీర్ కన్నయ్య ను పిలిచి వరదనీటికి అడ్డుకట్ట వేయాలని కోరగా కేవలం ఐదు రోజుల్లో గేట్ ను నిర్మించి వరదను అడ్డుకున్నారు. అయితే డ్యామ్ నిర్మాణం సిమెంట్ లేకుండా కేవలం మట్టి,సున్నపురాయి ని మిశ్రమంగా చేసి కట్టడం ఇప్పటివరకు ఎటువంటి లీకులు లేకుండా డ్యామ్ భద్రంగా వంద టీఎంసీల నీటికి అడ్డుకట్ట వేసి మూడు రాష్ట్రాల రైతులకు అన్నదాత గా నిలుస్తుంది.డ్యామ్ నిర్మాణానికి భూమి పూజ చేసి ఫిబ్రవరి 28వ తేదీకి 80 ఏళ్ళు పూర్తి కావడంతో డ్యామ్ ఛైర్మెన్ పాండే,సెక్రటరీ ఆర్.కె.రెడ్డి,ఈ.ఈ నారాయణ నాయక్ లు సిబ్బందికి ప్రతిభా పురస్కారాలు అందించారు.

## నీలితొట్ల వీధి ఘటనపై సమగ్ర విచారణ చేయండి - ఎమ్మెల్యే బుడ్డా

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** నీలి తొట్ల ఘనపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి మున్సిపల్ , వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ నీలితొట్ల వీధిలో వాంతులు విరేచనాలతో ఇద్దరు మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢసానుభూతిని తెలుపుతూ అన్ని విధాలుగా మృతుల కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు . అలాగే మృతికి గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. కాలనీలో పారిశుద్ధ్యం పనులు ముమ్మరం చేసి ఎక్కడైన పైపులు లీక్‌అవుతుంటే వాటిని వెంటనే మరమ్మత్తులు చేయాలన్నారు. ఎక్కడ కూడా నీరు కలుషితం కాలేదని, నీరు కలుషితం కావచ్చునే అనుమానం వచ్చినా అవకాశం లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నీలి తొట్ల వీధికి చెందిన రహంతుల్లా(55), బిషిరూన్(65)లు కలుషిత నీరు తాగి మృతి చెందారనేది వాస్తవం కాదని, ఆ వీధిలోని నీటి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయించడం జరిగిందన్నారు. ఆత్మకూరు పట్టణ ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికావాల్సిన పనిలేదని నీరు కలుషితం కాలేదన్నారు. ఆత్మకూరు పట్టణ ప్రజల క్షేమమే తన ధ్యేయమని ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే పరిష్కరించి వారికి అండగా ఉంటానని,



శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

నీరు కలుషితం అయ్యిందనే వచ్చే ఉదంతాలు నమ్మవద్దని అన్నారు. వైద్యులు , సిబ్బంది నీలితొట్ల వీధిలో అందుబాటులో ఉండి తగు సేవలందించాలని అన్నారు . అలాగే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండి పారిశుద్ధ్యం లోపించకుండా చూసుకోవాలని ఆదేశించామన్నారు.

## మైనారిటీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కంకణం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ సంవత్సరానికి ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మైనారిటీ సంక్షేమానికి రూ.5,434 కోట్లు కేటాయించడంపై రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ ప్రశంసల జల్లు కురిపించారు. రాష్ట్రంలోని మైనారిటీ సంక్షేమానికి సీఎం నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న విషయాన్ని ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించడమే ఇందుకు నిదర్శనమని శుక్రవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోఓ ఐదేళ్ళ కాలంలో మైనారిటీలకు అడుగడుగునా మోసమే ఎదురైందని మైనారిటీ వర్గాలను మభ్యపెట్టి అప్పటి ప్రభుత్వం సంక్షేమాన్ని తుంగలో తొక్కిందన్నారు. మైనారిటీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.4376కోట్లు కేటాయిస్తే ప్రస్తుతం బడ్జెట్‌లో అదనంగా రూ.1058కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. మైనారిటీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మైనారిటీల లబ్ధి పొందేందుకు వీలుగా సబ్‌ప్లాన్‌కు రూ.2512కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మైనారిటీ సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం మనారిటీ సంక్షేమ పథకాలను నిలిపివేసిందన్నారు. ఈ పథకాలను తిరిగి పునరుద్ధరణ చేసిందన్నారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు చేయడంపై మైనారిటీ వర్గాల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు.



రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

## శ్రీరామకృష్ణలో సిగ్మా జాతీయ సైన్స్ ఫెస్ట్



**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో శుక్రవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని సిగ్మా సైన్స్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎంవి సూర్యప్రకాశ్, కేశవ్, శ్రీరామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ కెబీవీ సుబ్బయ్య, కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, కళాశాల ఎస్టేట్ మేనేజర్ ప్రగతిరెడ్డి, కన్వీనర్స్ విజయ్‌కాంత్, మోహన్‌మురళీధర్, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న ప్రతి నైపుణ్యాన్ని బయటపెట్టడానికి ఇది ఒక వేదికగా అందరికీ ఉపయోగపడుతుందన్నారు. మనం సైన్స్‌లో వస్తున్న ఎన్నో మార్పులను గమనించాలన్నారు. భారతదేశం ఒక జ్ఞానగని అన్నారు. ఎన్నో గొప్ప విషయాలను ఆనాటి కాలంలోనే సైన్స్ విజ్ఞానం అందుబాటులో లేని సమయంలోనే ఎన్నో పరిశోధనలు చేసి అద్భుతమైన విషయాలను కనుగొన్నారన్నారు. ప్రిన్సిపల్ సుబ్బయ్య, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, ప్రగతిరెడ్డి, విజయకాంత్‌లు మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను చూపించుకోవడానికి ఇది ఒక మంచి వేదికగా ఉపయోగపడుతుందన్నారు. సైన్స్ డేని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జరుపుకుంటామన్నారు. మన దేశంలో ఎందరో విజ్ఞానులు అప్పట్లోనే ఎన్నో గొప్ప విషయాలను కనుగొన్నారన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ముందుగా నేషనల్ సైన్స్ డే ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించిన అందరికీ నా అభినందనలు, వివిధ కళాశాలల నుంచి ఇక్కడికి విచ్చేసిన విద్యార్థులు అందరికీ నా అభినందనలు తెలిపారు. అనంతరం కళాశాల యాజమాన్యం అతిథులను ఘనంగా సన్మానించారు.

## రవీంద్ర విద్యార్థులకు ప్రథమ బహుమతి




బహుమతులు పొందిన విద్యార్థినీలు

**కల్లూరు, మేజర్ న్యూస్ :** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు లోని ఐఐఐటి డిఎం యూనివర్సిటీలో నిర్వహించిన నేషనల్ సైన్స్ డే 2025పోటీలలో రవీంద్ర బాలికల పాఠశాల(ఆర్‌ఆర్‌ఎస్) విద్యార్థినీలు డ్యూయల్ పర్పస్ వీల్ చైర్ మరియు స్ట్రెచర్ బెడ్ ఫర్ హాస్పిటల్ అంశమునకు ప్రథమ బహుమతి పొందారు. ఈ సందర్భంగా బహుమతి పొందిన విజేతలు 8వ తరగతి విద్యార్థినీలు యస్ అఫీఫా ఫిర్దోస్, జి యస్ లిఖీత, పి సమీరా భానులను,అందుకు సూచనలు అందించిన ఏటీఎల్ మాస్టర్ రమేష్ రంజిత్‌కు రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి పుల్లయ్య,చైర్మన్ జీవిఎం మోహన్ కుమార్,అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ మమతా మోహన్,వైస్ చైర్మన్ వంశీధర్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

## అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి

- గ్రామాల్లో ప్రజలకు త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి
- అధికారుల ఆదేశాలు జారి చేసిన ఎమ్మెల్యే
- గ్రామాల్లో సమస్యలుంటే నా దృష్టికి తెస్తే పరిష్కరిస్తాం – ఎమ్మెల్యే



**పత్తికొండ, మేజర్ న్యూస్ :** పత్తికొండ నియోజకవర్గ పరిధిలో అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని, వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కె.ఈ శ్యామ్ కుమార్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం పత్తికొండ ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ నందు నియోజకవర్గ స్థాయి పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలను రూపొందించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. పట్టణంలోని ప్రతి వార్డుకు రెండు రోజులకు ఒకసారి ఖచ్చితంగా తాగునీరు సరఫరా చేయాలని, ప్రస్తుత గ్రామాల్లో ఎన్ని రోజులకు తాగునీటి సరఫరా చేస్తున్నారని, భూగర్భ జలాలు అడుగంటే అవకాశం ఉన్నందు వలన నీటి సమస్య ఉత్పన్నమయ్యే గ్రామాలను గుర్తించి బోర్లను లోతు తవ్వడం, కొత్త బోర్లు అవసర మయ్యే ప్రాంతాలను గుర్తించాలనిఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలిపారు. కొన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం కనిపిస్తోందని, పంచాయతీ కార్యదర్శులు వారంలో నాలుగు రోజులు ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించాలన్నారు. ఉద్యోగులు గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ భరత్ నాయక్, ఏడిఏ మోహన్, విజయ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ ఖాన్ బాష, యిరిగేషన్ డిఈ డివిల్పి వీరభద్రప్ప, ఈఓఆర్‌డి నరసింహులు, మండల అధికారులు, పాల్గొన్నారు.

## తాగునీరు కలుషితం కాలేదు : నంద్యాల కలెక్టర్ రాజకుమారి

- ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదు
- 24 గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి : జిల్లా కలెక్టర్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలోని నీలితొట్ల వీధిలో నీరు కలుషితం కాలేదని ప్రజలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అన్నారు. కొళాయిల ద్వారా సరఫరయ్యే తాగునీరు కలుషితంపై ఆర్డీఓ కార్యాలయంలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటిలోని 5వ వార్డు నీలితొట్ల వీధిలో నీరు కలుషితం కాలేదని అన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

లేదని నీటి పరీక్ష చేయడం జరిగిందన్నారు. వెలుగోడు రిజర్వాయర్ నుంచి బోర్‌వెల్స్ ద్వారా సరఫరా అయ్యే ప్రతి ప్రాంతంలో నీటి నమూనాలన తీసి పరీక్ష చేయించడం జరిగిందని నీరు ఏమాత్రం కలుషితం కాలేదన్నారు. అధికారులు పట్టణంలోని ప్రతి వీధిలో పారిశుద్ధ్య పనులు చేపట్టి నీరు కలుషితం కాకుండా ఉండేలా పైపులైన్‌లు శుభ్రం చేయాలని మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించామన్నారు. అలాగే 24 గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిఎంఅండ్‌హెచ్‌ఓ, డిసిహెచ్ఎస్‌లను ఆదేశించామన్నారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టి పరిశుభ్రతను మెరుగుపరచాలన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పనులు ముమ్మరం చేసి జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ఆర్డీఓ నాగజ్యోతి, డిఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, డిసిహెచ్ఎస్ జఫరుల్లా, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి

- గడువులోగ పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయాలి
- కల్లూరు ఇండస్ట్రీయల్ అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించండి
- కర్నూలు జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌భాషా



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌భాషా

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను గుర్తించి పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌భాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్టిక్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టమోటా,ఉల్లి,మిర్చి, మిల్లెట్స్‌కు సంబంధించిన ప్రాసెసింగ్ యూనిట్లు ఇతర పరిశ్రమల ఏర్పాటుకు మందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలను గుర్తించి పరిశ్రమలు ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే సింగిల్ డెస్క్ పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులకు అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని ఎంఎస్ఎంఈల ఏర్పాటుపై అవగాహన సదస్సులు నిర్వహించాలని పరిశ్రమల శాఖ జీఎంను ఆదేశించారు. అలాగే కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ అభివృద్ధి అయ్యేందుకు వీలుగా ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ఓర్వకల్ మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో రోడ్లు,నీటి సరఫరా పైప్‌లైన్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. పత్తికొండలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుపై ఆరా తీశారు. త్వరలో భూమి పూజ చేయనున్నట్లు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ అధికారి కలెక్టర్‌కు వివరించారు. నియోజకవర్గానికి ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు సంబంధించి భూమిని గుర్తించేందుకు సంబంధిత ఆర్డీఓలు సబ్ కలెక్టర్లతో పరిశ్రమలు ఏపిఐఐసి జడ్ఎం సమావేశాలు ఏర్పాటు చేసుకుని వారంలోపు తనకు నివేదికలు పంపాలని ఆదేశించారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాల్లో భాగంగా 17లైన్లకు 1.69కోట్లు ఆమోదం తెలపడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ఇంచార్జ్ జీఎం అరుణ, ఐలా చైర్మన్ రామకృష్ణారెడ్డి,చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌సి,ఎస్‌టి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహింద్రనాథ్,ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ కోఆర్డినేటర్ దిలీప్,లీడ్ బ్యాంక్ మేనేజర్ రామచంద్రరావు, ఏపిఎంఐపి పిడి ఉమాదేవి,ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ : ఎంపి నాగరాజు



**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ఉందని ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై శుక్రవారం తన కార్యాలయంలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ఫలాలు అందరికి అందేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారన్నారు. బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఎన్నికల మేనిఫెస్టో హామీల అమలుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో భాగమైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ,పించన్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఇక బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం సంతోషంగా ఉందని ఎంపి తెలిపారు.

## గురురాజలో అట్టహాసంగా సైన్స్ ఎక్స్‌పో



శ్రీగురురాజ విద్యాసంస్థల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎన్ఎండి ఫయాజ్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో గల శ్రీగురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఇంట్రా స్కూల్ సైన్స్ ఎక్స్‌పో2025 ఎగ్జిబిషన్ ఘనంగా నిర్వహించినట్లుగా స్కూల్ డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఫయాజ్, శ్రీగురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి, శ్రీరామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులశిరెడ్డి, డైరెక్టర్ మౌలాలిరెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ కార్యక్రమంలో పాల్గొని భారతరత్న సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో 450 పైగా ప్రాజెక్టులను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారు. ఈసందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ గురురాజ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులలో ఉన్న ప్రతిభను బయటకు తీయడానికి ఇలాంటివి చాలా ఉపయోగపడతాయని కొత్త సృష్టించాలన్న ప్రయోగం చేయాలన్న ఈసైన్స్ ఎగ్జిబిషన్ ద్వారా చేయగలరని తెలిపారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న విజ్ఞాన ప్రతిభా పాటవాలను వెలికితీయాలనే సంకల్పంతో ఈ ఇంట్రా స్కూల్ సైన్స్ ఎక్స్‌పో ప్రతి సంవత్సరం నిర్వహిస్తూ సైన్స్ ఆవశ్యకతను విద్యార్థులు తెలియ జేస్తున్నామన్నారు. నేషనల్ సైన్స్ ఫెయిర్‌లో మా విద్యార్థులు సాధించిన విజయాలే దీనికి తార్కానమని



విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న దృశ్యం

విద్యార్థుల విజయాలను, ఉపాధ్యాయులను ప్రశంసించారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవికృష్ణలు మాట్లాడుతూ గురురాజా విద్యార్థులు సైన్స్ ఎక్స్‌పో చాలా అద్భుతంగా నిర్వహించాలన్నారు. సైన్స్ ఎక్స్‌పోలో రాకెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చంద్రయాన్ స్ఫూర్తితో నిర్వహించిన రాకెట్ ప్రదర్శన అతిథులను ఆకట్టుకుంది.

## కాలనీల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

– నగరపాలక కమీషనర్ యస్. రవీంద్రబాబు

**కర్నూలు నగరం, మేజర్ న్యూస్ :** నగర పరిధిలోని కాలనీల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు తెలిపారు. శుక్రవారం 46వ నరసింహారెడ్డి నగర్‌లో వివిధ కాలనీల్లో కమీషనర్ విస్తృతంగా పర్యటించారు. ఆయా కాలనీల్లో పూడికతీత పనులు,ధ్వంసమైన మురుగు కాలువలు,కెసి కాలువ వద్ద రక్షణ వలయంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువల్లో తక్షణమే మరమత్తు పనులు,పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. తాగునీరు వృధాకు ఆస్కారం లేకుండ తక్షణమే పైప్‌లైన్,కొళాయిల వద్ద లీకేజీలను అరికట్టాలని పేర్కొన్నారు. అలాగే ఆయా కాలనీల్లో మురుగు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని కమీషనర్ ఆదేశించారు. అంతకన్న ముందు ఆయన కలెక్టరేట్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అలాగే నెహ్రూనగర్,పోస్టల్ కాలనీ, ఎస్టిబిసి గ్రౌండ్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాసరావు,డిఈఈ గంగాధర్,ఏఈ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



సూర్య



## బీసీ సంక్షేమ కోసం అధిక ప్రాధాన్యత..జనరంజకంగా ఏపీ బడ్జెట్



రామకృష్ణ

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం 2025-26 కు శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉందని సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా కేటాయింపులు చేసిందని రాష్ట్ర కురువ కార్పోరేషన్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్ లో అధిక ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. అన్నదాతసుఖీభవ, తల్లికి వందనం, పథకాలకు బడ్జెట్లో కేటాయింపులలో కూటమి ప్రభుత్వం చిత్త శుద్ధి ప్రదర్శించిదని తెలిపారు. బీసీ సంక్షేమానికి సబాన్ ద్వారా బడ్జెట్ లో పెద్ద పీట వేశారని అలాగే ఎస్సీఎస్టీ వెజనార్థీ అభివృద్ధి కి బాటలు వేశారని తెలిపారు. బీసీ ఎస్సీ, ఎస్టీ స్కాలర్షిప్కోసం రూ. 3.377 కోట్లు కేటాయించారన్నారు. బీసీ సంక్షేమకు రూ. 23,260 కోట్లు కేయించిన ఘనత కూటమీ ప్రభుత్వలకు మాత్రమే దక్కుతుందన్నారు. రైతుల కోసం ఎరువుల నిర్వహణ కోసం రూ. 40కోట్లు, ప్రకృతి వ్యవసాయ ప్రోత్సహంకు రూ. 61 కోట్లు, వ్యసాయ యంత్రాల రాయితీకి రూ. 139 కోట్లు కేటాయించారని అన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ నిరుపేద బడ్జెట్ అని ఎంతో బాగుందన్ని కొనియాడారు.

## నేడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాక

(మొదటిపేజి తరువాయి..)



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న అధికారులు



హెలిప్యాడ్‌ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

మాజీ ఎమ్మెల్సీ కె.ఈ ప్రభాకర్, మంత్రాలయం టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డిలు శుక్రవారం తెలిపారు. అందులోభాగంగా, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మిగనూరు డిఎస్పీ ఉపేంద్రబాబు, సిఐ రామాంజులులు ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. మంత్రాలయంలోని హెలిప్యాడ్ మైదానం, పద్మనాభ తీర్థ గెస్ట్‌హౌస్, శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పరిసర ప్రాంతాలను జిల్లా అధికారులు, టీడీపీ నాయకులు పరిశీలించారు. అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులతో కలిసి ఆయన పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం శ్రీ మఠం పీఠాధిపతులతో మఠంలో జరుగు కార్యక్రమాల గురించి, దర్శనం గురించి చర్చించారు. ఈ సందర్భంగా మఠం పీఠాధిపతి మాట్లాడుతూ, ఉదయం మంత్రి నారాలోకేష్ తాడేపల్లి నుండి మంత్రాలయం చేరుకుంటారు. హెలిప్యాడ్ నుంచి కారులో మఠం ప్రాంగణంలో ఉన్న పద్మనాభ తీర్థ గెస్ట్‌హౌస్ చేరుకొని కాసేపు విశ్రాంతి తీసుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలుస్తారన్నారు. గెస్ట్‌హౌస్ నుండి మెయిన్ రోడ్డుగుండా శ్రీ మఠం పరిసర ప్రాంతాలకు చేరుకుంటారని, అక్కడకు రాగానే మంత్రికి మఠం సిబ్బంది ఆలయ సంప్రదాయ ప్రకారం ఘనస్వాగతం పలుకుతారు. ముందుగా ఆయన గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుంటారు. నేడు గురుభక్తోత్సవాల్లోభాగంగా, పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమం మఠం ప్రాంగణంలో జరుగును. అనంతరం 30నిమిషాలు పూజల్లో మంత్రి పాల్గొని గురుభక్తోత్సవాల్లోభాగంగా, 2025 రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డును తీసుకుంటారని తెలిపారు. ముందుగా ఆయన రాఘవేంద్రస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తారు. అనంతరం సాంస్కృతిక విద్యా పాఠశాలకు ముందు భాగంలో నూతనంగా నిర్మించిన కారిడార్‌ను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం తహశీల్దార్ రవి, సిఐ రామాంజులు, పన్నాగ వెంకటేష్, మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహా స్వామి, టీడీపీ నాయకులు నాగేశ్వర యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, టిప్పుసుల్తాన్, చందాఖాన్, విజయరెడ్డి, ఏల్లారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, ఆశోక్ రెడ్డి, వరదరాజులు, వెంకటేష్, వీరేష్, శివ, తలారి హనుమంతు, తిమ్మప్ప, నరసింహులు, రఘు, రామకృష్ణ, చిదానంద, అధికారులు పాల్గొన్నారు.

**మంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ పరిశీలన :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో గురు భక్తోత్సవాల్లో ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేడు పాల్గొనున్నారు. ముందుగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, మంత్రాలయం టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డితో కలిసి హెలిప్యాడ్, గెస్ట్‌హౌస్, ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న పరిస్థితులను గురించి ఎమ్మిగనూరు డిఎస్పీ ఉపేంద్రబాబు, సిఐ రామాంజులుతో విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లను చేయాలని సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచించారు.

## పీఆర్సీ అమలుకు కేటాయింపులేవి-ఎస్.టి.యు

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** 2023 జూలై నుండి అమలు చేయవలసిన 12వ పీఆర్సీ ఇప్పటికే 20 నెలలు ఆలస్యమైనప్పటికీ, ఈరోజు ప్రవేశపెట్టిన బడ్జెట్లో పీఆర్సీ, ఐ.ఆర్ అమలు కొరకు నిధుల కేటాయింపులపై స్పష్టత ఇవ్వలేదని రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆం.ప్ర రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి శివశంకర్ తెలిపారు. ఎస్ టి యు చాగలమరి మండల శాఖ అధ్యక్షులు జి మస్తాన్ భాష అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సిపిఎస్ /జిపిఎస్ కన్నా మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీపై బడ్జెట్లో ఎటువంటి ప్రకటన లేదని జిల్లా ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా, ఉస్మాన్ విమర్శించారు. మండల అధ్యక్షులు మస్తాన్ భాష ప్రధాన కార్యదర్శి సుబ్బారావు ఆర్థిక కార్యదర్శి మాబు హుస్సేన్ మాట్లాడుతూ పాఠశాల విద్యకు గత సంవత్సరం 10.15% నిధులు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్లో 9.86% మాత్రమే నిధులు కేటాయించారన్నారు. ఆర్థిక మంత్రిగారు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ 'జీవిత కాలానికి ప్రణాళిక వేస్తే ప్రజలకు విద్య నేర్పండి'అని చైనీయుల సామెతను ఉఠంకించారని, విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మోడల్ గా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటించిందని, కానీ దానికి తగినన్ని నిధులు బడ్జెట్లో కేటాయించ లేదని విమర్శించారు.ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తామని చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు. అలాగే తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపచేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని తెలిపారు.జిల్లా మాజీ అధ్యక్షులు పి ప్రసాద్, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, శేషాద్రి, జిల్లా కౌన్సిలర్స్ సురేష్ అప్ప, రాజశేఖర్ రెడ్డి, నరసింహులు, సంజీవరెడ్డి, కృష్ణశాస్త్రి, వై శ్రీనివాసులు ,పుట్టాలయ్య, ఎన్ ప్రసాద్, వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

## శ్రీశైలంలో శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి

(మొదటిపేజి తరువాయి..)



ముగింపు క్రతువులకు శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా స్వామివారి యాగశాలలో వేద పండితులు చండీశ్వరునికి ప్రత్యేక పూజలు జరిపారు. తదుపరి రుద్రహోమ పూర్ణాహుతి,వసంతోత్సవం, అవభృందం,త్రిశూలస్నానం కార్యక్రమాలు నిర్వహించారు. పూర్ణాహుతిలో శాస్త్రోకంగానారికేళాలు,పలు సుగంధద్రవ్యాలు, ముత్యం, పగడం,నూతన వస్త్రాలు వంటి పూజాద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించారు. వసంతోత్సవంలో అర్చకులు,పండితులు వసంతాన్ని (పసుపు,సున్నం కలిపిన మంత్రపూరిత జలం) సమంత్రకంగా భక్తులపై ప్రోక్షించారు. చండీశ్వరుడికి సరస్వి పుష్కరిణి వద్ద ఆగమ శాస్త్రబద్ధంగా స్నానాదికాలు జరిపారు. చివరిగా త్రిశూలస్నానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవాల ముగింపు సూచికంగా ధ్వజపటాన్ని అవరోహణ చేశారు. ఉత్సవాల మొదటి రోజు బ్రహ్మోత్సవ ప్రారంభ సూచికంగా ఆలయ ప్రధాన ధ్వజస్తంభంపై ఆవిష్కరింపజేసిన ధ్వజపటాన్ని అవరోహణ చేయడం ఆనవాయితీ.

**సదస్యం-నాగవల్లి :** మహా శివరాత్రి బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో స్వామివారి నిత్యకల్యాణ మండపంలో సదస్యం - నాగవల్లి పల్లి కార్యక్రమాలు నిర్వహించారు. సదస్యం కార్యక్రమంలో వేదపండితులచే వేదస్వస్తి నిర్వహించారు. వేదస్వస్తిలో వేదపండితులు చతుర్వేద పారాయణంలో స్వామి అమ్మవార్లను స్తుతించారు. నాగవల్లి కార్యక్రమంలో మహాశివరాత్రి రోజున కల్యాణోత్సవం జరిపించిన భ్రమరాంబాదేవికి ఆగమశాస్త్రం సంప్రదాయం మేరకు మెట్టెలు, నల్లపూసలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు,అధికారులు, అర్చక స్వాములు పాల్గొన్నారు.

**నేడు అశ్వవాహన సేవ :** బ్రహ్మోత్సవాల చివరి రోజు శనివారం సాయంత్రం భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివారికి అశ్వవాహనసేవ,ఆలయ ప్రాంగణంలో ఉత్సవ ఊరేగింపు జరుపుతారు. అనంతరం అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు ధ్వజ పటాన్ని అవరోహణ చేస్తారు. పుష్పోత్సవం, శయనోత్సవం,ఏకాంతసేవ నిర్వహిస్తారు. ఆయా కార్యక్రమాలు పూర్తవడంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

## భక్తజన సందోహం మధ్య పార్వతీ పరమేశ్వరుల రథోత్సవం

(మొదటిపేజి తరువాయి..)



స్వామివార్లకు అశ్వవాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు చేసి ఉత్సవంగా రథశాలకు చేర్చారు. అనంతరం వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, శాంతారాంభట్, హనుమంతరావు శర్మలతో పాటు ప్రత్యేక వేదపండితుల వేదమంత్రాలతో రథంపై కొలువు తీరిన స్వామి, అమ్మవార్లకు విశేష పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, నంద్యాల మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణిలు ఆనవాయితీగా ప్రారంభించారు. అనంతరం స్వామివార్ల రథోత్సవం ఆలయ ప్రదక్షణగా దాదాపు 2 గంటల పాటు జరిగింది. భక్తులు రాథాన్ని లాగుతూ భక్తి శ్రద్ధలతో ఓంకార నామ నీరాజనాలు సమర్పించారు.

**రథశాల వద్ద పూజలు:** మహానంది పుణ్య క్షేత్రంలో రథోత్సవం సందర్భంగా రథశాల వద్ద వేదపండితులు వేదమంత్రాలతో ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డిచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, వాస్తు వర్ణహోమాలు, కూష్మాండబలి, సూర్యభగవానుడికి పాలాభిషేకం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మధ్యాహ్న సయంలో తమ్మడపల్లి ఆచార్యులు అన్న బలిహరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**అశ్వవాహన సేవ:** మహానంది పుణ్య క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం పురష్కరించుకొని ఉదయం అశ్వ వాహన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగాస్వామి, అమ్మవార్లను అశ్వవాహనంపై కొలువు తీర్చి ప్రత్యేక అలంకారాలు చేశారు. అనంతరం స్వామివార్ల పల్లకి ఆలయప్రదక్షణగా మాడా వీధులలోఅత్యంత వైభవంగా నిర్వహించారు.

**అలరించిన నృత్యాలు:** రథోత్సవం ముందు కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. కర్నాటకకు చెందిన భక్తులు నృత్యప్రదర్శనలు చేస్తూ డ్రమ్స్ వాయిస్తూ ఆకర్షించారు. అలాగే ఆర్‌ఎస్‌ఎస్, సమరత సేవా ఫౌండేషన్ వారు భారీ కాషాయి జెండాలతో ప్రదర్శనలు చేశారు. గిరిజన యువకులు డ్రమ్స్ వాయిస్తూ ఆకర్షించారు.

## రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే విధంగా బడ్జెట్ ఉంది

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ
- రాష్ట్ర పునర్నిర్మాణానికి రూ. 3 లక్షల 22 వేల కోట్ల భారీ బడ్జెట్ ను ప్రవేశపెట్టడంపై హర్షం



మాట్లాడుతున్న గుడిసె కృష్ణమ్మ

**ఆదోని, మేజర్ న్యూస్:** 'ఈరోజు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అలాగే రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేవిధంగా ఉంది' అని ఆదోని టిడిపి మాజీ ఇంచార్జ్, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ అన్నారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రూ. 3లక్షల 22వేల కోట్ల బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం అందులో వ్యవసాయం, పంచాయతీ రాజ్, విద్య, వైద్యానికి నిధులు కేటాయింపుల్లో కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడంపై శుక్రవారం కృష్ణమ్మ హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొట్టమొదటి పూర్తిస్థాయి బడ్జెట్ అద్భుతంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, పవన్ కళ్యాణ్, నారా లోకేశ్‌లకు ఈ సందర్భంగా ఆమె ధన్యవాదములు తెలిపారు. పేదల విద్య కోసం నారా లోకేశ్ కృషి వల్ల ప్రాథమిక, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధికి కలిపి బడ్జెట్ లో 15 శాతం అంటే దాదాపు రూ. 40వేల కోట్లు కేటాయింపులు జరగడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. అంతేకాకుండా పల్లెలలో త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనుల కోసం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శాఖకు సంభందించిన పంచాయతీరాజ్ కు రూ. 18, 800 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. అయితే గత వైసీపీ ఐదేళ్ల పాలనలో పంచాయతీ రాజ్ కు నిధులు కేటాయింపుల్లేక, వచ్చిననిధులను కూడా ఆనాటి ప్రభుత్వం దారి మళ్ళించడం వల్లన గ్రామ వ్యవస్థ నిర్వీర్యమైన పరిస్థితిని ఆమె గుర్తు చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోపు రూ. 4 కోట్ల నిధులతో మా ఆదోని నియోజకవర్గంలోని గ్రామాలలో ఇప్పటివరకు డ్రైనేజీలు, రోడ్లు, వీధిలైట్లు వేశామని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేశ్, ఆర్థిక మంత్రి పయ్యావులకేశవ్‌లు ప్రజల అకాంక్షలను బడ్జెట్‌లో పొందుపరిచారని కృష్ణమ్మ స్పష్టంచేశారు. అపార అనుభవం ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతి తప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ఎంతగానో శ్రమిస్తున్నారని వ్యాఖ్యానించారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు హామీల అమలుకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలకు బడ్జెట్ కేటాయింపులు ఇవ్వడం ఎన్డీఏ కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఈ బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభివృద్ధికి బాటలు వేశారని గుడిసె కృష్ణమ్మ వెల్లడించారు.

## దాడి ఘటనలో ఇరువురిపై కేసు నమోదు

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్:** కొలిమిగుండ్ల మండలంలోని నందిపాడు గ్రామంలో నర్సిగాళ్ల గీత వయస్సు 17 సంవత్సరాలు తండ్రి నరసింహుడు అను అమ్మాయిని అదే గ్రామానికి చెందిన ఓబన్న అను వ్యక్తి వెంటపడి వేధిస్తున్నాడని గీత తన తల్లిదండ్రులకు చెప్పగా ఇరు కుటుంబాల వారు కట్టెలతో కొట్టుకొని గొడవ చేసుకొనగా నర్సీపల్లె గీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెద్ద ఓబన్న మరియు హుసేనమ్మలపై కేసు నమోదు చేయడం జరిగింది అలాగే హుసేనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసింహులు, గీత, లక్ష్మిదేవి, చరణ్‌లపై కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల సి.ఐ రమేష్‌బాబు తెలిపారు.

# ఇళ్ళ నిర్మాణాల క్యూరింగ్ కోసం పబ్లిక్ కొళాయి నీళ్లు ..?


త్రాగునీటి ని పైపు ద్వారా ఇంటినిర్మాణాం క్యూరింగ్ కోసం ఉపయోగించే దృశం

**పెద్దకడుబూరుమేజర్ న్యూస్ :** ఒకవైపు ఎండలు భగభగ మండుతున్నాయి. మరోవైపు త్రాగునీటి కోసం ప్రజలు అల్లాడుపోతున్నారు. అయితే కొందరు వ్యక్తులు త్రాగునీటిని పబ్లిక్ కొళాయిలకు పైపులను అమర్చి తమ ఇంటి నిర్మాణం కట్టడాలు క్యూరింగ్ కోసం నీటిని వాడుకుంటున్న వైనం పెద్దకడుబూరు మండల పరిధిలోని నౌలకల్. పెద్దకడుబూరు గ్రామంలో కన్పించింది. ముఖ్యంగా నౌలకల్ గ్రామంలో ఓ వ్యక్తి నేరుగా స్థానిక గ్రామ సచివాలయం దగ్గర త్రాగునీటి కోసం గ్రామ పంచాయతీ అధికారులు మంచినీటి గుమ్మి ఏర్పాటు చేశారు. అయితే ఈ నీటి గుమ్మి ద్వారా కాలనీ వాసులు అక్కడకు వచ్చినీళ్ళునుపట్టుకుని వెళ్లి పోతున్నట్లు.గ్రామస్తులు తెలిపారు. అయితే ఓ వ్యక్తి తనఇంటినిర్మిణా కోసం గ్రామ సచివాలయం వద్ద ఉన్న నీటిగుమ్మికి ఉన్న కొళాయికి పైపును బిగించి దర్జాగా తాగునీటిని వాడుకొంటున్నాట్లు చెప్పారు. గురువారం రోజున ఇవోఆర్డీ జయరాముడు. గ్రామ పంచాయతీ కార్యదర్శి శేషన్న శానిటేషన్ నిమిత్తం మీద నౌలకల్ గ్రామానికి చేరుకొనిగా అక్కడ మంచి నీటి గుమ్మికి ఉన కొళాయికి పైపు వేసినీటినిఇంటి నిర్మాణం కోసం వాడకొంటున్న విషయాన్ని గమనించిన ఇవోఆర్డీ జయరా ముడు. పంచాయతీ కార్యదర్శి శేషన్న వెంటనే కొళాయికి వేసిన పైపును తొలగించారు. అలాగే పెద్దకడుబూరు గ్రామంలో కూడా ఓ వ్యక్తి తన ఇంటి దగ్గర ఉన్న పబ్లిక్ కొళాయి కి విద్యుత్ మోటర్ బిగించి దర్జాగా ఇంటినిర్మిణాం క్యూరింగ్ కోసం త్రాగు నీటిని సరఫరా చేసుకుంటుండంతో చివరి కాలనీ వాసులకు త్రాగు నీరు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . ఇంటినిర్మిణాలు క్యూరింగ్ కోసం త్రాగునీటిని వాడు కుంటున్న వారిపై ఇవోఆర్డీ. పంచాయతీ కార్యదర్శి. గ్రామ సర్పంచ్ లు తగుచర్యలు తీసుకోవాలని అయా గ్రామాల ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీవాణి స్కూల్ ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవ వేడుకలు

**మిడుతూర్ (నందికొట్కూర్) మేజర్ న్యూస్ :** శ్రీవాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరము సైన్స్ దినోత్సవ వేడుకలను ఫిబ్రవరి 28వ తేదీ సర్ సివి రామన్ జన్మదిన సందర్భంగా ఈ వేడుకలను దేశవ్యాప్తంగాజరుపుకుంటారు.సైన్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా శ్రీవాణి స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా సైన్స్ ప్రాధాన్యతను తెలియజేసే విధంగా పరికరాల ఉపయోగం , వాటి సద్వినియోగంపై విద్యార్థులకు కరెస్పాండెంట్ విజయకుమార్ అవగాహన కల్పించారు. అనంతరం శ్రీ వాణి స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు నాగేశ్వరావు మాట్లాడుతూ సైన్స్ దినోత్సవాన్ని చంద్రశేఖర్ వెంకటరమణ భౌతిక శాస్త్రవేత్త జన్మదిన సందర్భంగా దేశ వ్యాప్తంగా జరుపుకుంటారు ఆయన భౌతికశాస్త్రంలో నోబుల్


ప్రదర్శన నిర్వహిస్తున్న శ్రీవాణి స్కూల్ విద్యార్థులు

బహుమతికూడా పొందారు భూమిపై ప్రతి ఒక్కరి జీవితంలో సైన్సు ముఖ్యమైనదని ఆయన అన్నారు సైన్స్ డే నేను రామన్ ఎఫెక్ట్ డేను సైన్స్ దినోత్సవం కూడా జరుపుకుంటారని ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవాణి స్కూల్ ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# రమణీయం చంద్రమౌళీశ్వర స్వామి రథోత్సవం

**-: జనసంద్రమైన బిజినవేముల**
**-: భారీగా తరలివచ్చిన వివిధ గ్రామాల ప్రజలు..**



**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని బిజినివేముల గ్రామంలో భక్తుల కొంగు బంగారం అయినా చంద్రమౌళీశ్వర స్వామిరథోత్సవం గ్రామ ప్రథమ పౌరుడు రవి యాదవ్, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఆశేష జవాహిని మధ్య శుక్రవారం సాయంత్రం సూర్యాస్తమ సమయంలో అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా జరిగింది. ముందుగా ఆలయ అర్చకులు వేద మంత్రాలతో చంద్రమౌళీశ్వర కళ్యాణ మూర్తులను దివ్యరథంపై వర్తింపజేసి రథోత్సవంలో ఎటువంటి అపశృతులు జరగకుండా అత్యంత ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శివాలయం వద్ద నుండి ప్రారంభమైన రథోత్సవం భాజా భజంత్రీల మధ్య గ్రామంలోని పురవీధుల గుండా అంతా గ్రామస్తులు , భక్తులు రథం లాగుతూ హర హర మహాదేవ శంభో శంకర అంటూ యువత కేరింతలు



కొడుతూ రథాన్ని ముందుకు లాగారు .చుట్టుపక్కల గ్రామాలతో భక్తజన సందోహంతో బిజినవేముల గ్రామం కిక్కిరిసిపోయింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

# ఘనంగా స్వామివారి రథోత్సవ కార్యక్రమం

**అంగరంగ వైభవంగా దుర్గా భోగేశ్వరుడి రథోత్సవం**

**గడివేముల, మేజర్ న్యూస్ :** మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపాన ఉన్న దక్షిణ కాశీగా పేరుపొందిన శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి దేవస్థానం నందు శుక్రవారం నాడు ఫెస్టివల్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆలయ అధికారి రామానుజన్ సమక్షంలో అంగరంగ వైభవంగా శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి రథోత్సవం నిర్వహించారు. గత మూడు రోజుల నుండి మహాశివరాత్రి పురస్కరించుకొని జాగరణ స్వామి వారి కళ్యాణం చివరి రోజు అయిన శుక్రవారం నాడు కన్నుల పండుగ రథోత్సవం నిర్వహించారు .స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామివారినీ పల్లకిలో ఊరేగించి మంగళ వాయిద్యాలతో, మేళ తాళాల తో తేరు వద్దకు తెచ్చి ప్రత్యేక పూజలు అనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్క గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్సై నాగార్జున రెడ్డి, గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పురోహితుల శ్యాంసుందర్ శర్మ, గిరిధర్ శర్మ, ఆలయ అధికారి రామానుజన్, ఆలయ సిబ్బంది రమణ, చుట్టుపక్కల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దుర్గా భోగేశ్వరుడి ఉత్సవ విగ్రహాలను భోగేశ్వరుని పురవీధుల గుండా తిప్పుతూ డప్పు వాయిద్యాలతో నందికోళ్ల సేవల మధ్య ఉత్సవమూర్తులను రథంపై ఎక్కించి ఆలయ కమిటీ సభ్యులు మరియు ప్రజలు భక్తులు రథోత్సవాన్ని లాగి కన్నుల పండగ నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు ప్రజలు కమిటీ సభ్యులు పాల్గొన్నార ఈ కార్యక్రమంలో ఎలాంటి అవార్డుని సంఘటనలు జరగకుండా గడివేముల ఎస్సై సీసీ నాగార్జున రెడ్డి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.



# పదవీ విరమణ చేసిన ఆర్టీసీ డ్రైవర్ కు ఘన సత్కారం


ఘనంగా సన్మానిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ , మేజర్ న్యూస్ :** ఆర్టీసీ డిపోలో గత 34 సంవత్సరాలుగా విశిష్ట సేవలను అందించి శుక్రవారం పదవి విరమణ చేసిన ఆర్టీసీ డ్రైవర్ గోల్కొండ షేక్ సుభాన్ వలిని అధికారులు కార్మికులు ఘనంగా సత్కరించారు. డిపో మేనేజర్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా సుభాన్ వలి ఒక్క యాక్సిడెంట్ కూడా చేయకుండా అత్యుత్తమ సేవలు ఈ డిపోకు అందించారని కొనియాడారు. ఆళ్లగడ్డ విద్యుత్ ఏడిఈ రవికాంత్ చౌదరి, డిపో ఎన్ఎంయు యూనియన్ నాయకులు రాజశేఖర్, ఎంప్లాయిస్ యూనియన్ దానం ,కండక్టర్ రోశన్న ,వైఎస్ఆర్ యూనియన్ సుందర్ రాజు, కార్మిక నేత రమణ తది తరులు, డ్రైవర్ వలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సూత్రాలు పాటించాలి



**కృష్ణగిరి,మేజర్న్యూస్ :** ఆరోగ్య సూత్రాలు పాటిస్తే ఎలాంటి రోగాలు దరి చేరవని జిల్లా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బోయబొంతిరాళ్ల గ్రామాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి గ్రామ పంచాయతీ పనితీరును ,ఫలితాలను గుర్తించిన తాము అవార్డుకు ఎంపిక చేశామని తెలిపారు.గ్రామ సర్పంచు జె.రవి మోహన్ ఆధ్వర్యంలో జిల్లా మెడికల్ ఆఫీసర్ సమావేశం నిర్వమించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పొగాకు గుట్కా వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు.దగ్గు,లుబు తరుచుగా వస్తుంటే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరిక్షలు చేయించుకోవాలన్నారు.టిబి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిబి జిల్లా కో ఆర్డినేటర్ డి.ఉమాపతి,ంకా పలువురు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా సైన్స్ డే వేడుకలు




**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ( బాలురు ) చాగలమర్రినందు జరిగిన కార్యక్రమం.. సర్ సివి రామన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అనంతరం డాక్టర్ సివి రామన్ సైన్స్ లో కనుగొన్న విషయాలను చర్చించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దుదాం – ఎంపిడిఒ కె. సావిత్రి


మాట్లాడుతున్న ఎంపిడివొ సావిత్రి, ఈ.ఒ.పి.ఆర్డీ నాగ అనసూయలు

**దొర్నిపాడుమేజర్,న్యూస్ః** మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలను ప్లాస్టిక్ రహిత గ్రామ పంచాయితీలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపిడిఒ కె. సావిత్రి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం నందు పంచాయితీ కార్యదర్శులతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కె. సావిత్రి మాట్లాడుతూ గ్రామ పంచాయితీలలో ప్లాస్టిక్ నిషేధం చేపట్టుటకు ప్రణాళికలు తయారు చేసుకోవడానికి తగిన సూచనలు ఇవ్వడం జరిగిందని అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పునఃరుద్ధరించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమె తెలిపారు. సర్వే పైలట్ విలేజ్ అర్జునాపురం గ్రామ పంచాయితీ గ్రౌండ్, ఫ్రూట్ మరియు గ్రౌండ్ వాల్యుయేషన్ 36 కాలంమ్స్ ప్రొఫార్మల గురించి సర్వే గురించి పంచాయితీ కార్యదర్శులకు తగిన సూచనలు జారీ చేయడమైనది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ. సావిత్రి, ఇంచార్జి ఇ.ఒ.పి.ఆర్డీ నాగఅనసూయ, మండల రీసోర్స్ పర్సన్స్ పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సైన్స్ డే



**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ డేను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. డాక్టర్ సీవీ రామన్ చి త్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం నాగభూషణం, ఉపాధ్యాయుడు ఉస్మాన్ మాట్లాడుతూ సీవీ రామన్ ఎఫ్టేక్ గురించి వివరిం చారు. సైన్స్ అభివృద్ధి తోనే దేశ ప్రగతి ఉంటుందని అందరు శాస్త్రీయ ఆలోచనలతోనే ముందుకు వెళ్లాలని కోరారు. పలు శాస్త్ర వేత్తల జీవిత విశేషాలను ఉపాధ్యాయులు వివరిం చారు. అలాగే మండలంలోని పలు గ్రామాలలోని పాఠశాలలో సైన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేముగోడు గ్రామంలోని పాఠశాలలో సైన్స్ డే సందర్భంగ విద్యార్థులచే సైన్స్ ఎగ్జిమిషన్ ఏర్పాటు చేయించారు. సైన్స్ గొప్పతనంను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నన్నారి పెంచేలా చెంచులను ప్రోత్సహించాలి : నంద్యాల కలెక్టర్

- నన్నారి నర్సరీలను పరిశీలించిన కలెక్టర్ రాజకుమారి గణియా
- గిరిజన స్టోర్లు ఏర్పాటు చేయండి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** అంతరించి పోతున్న నన్నారి నర్సరీని చెంచులు సాగు చేసేలా ఐటిడిఎ అధికారులు ప్రోత్సాహాన్ని అందించి వాటి వల్ల వచ్చే లాభాలను చెంచులకు వివరించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అన్నారు. శుక్రవారం మండలంలోని బైర్లూటి చెంచు గూడెంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ఐటిడిఎ పిఓ వెంకటశివప్రసాద్‌లతో నన్నారి నర్సరీలను పరిశీలించి చెంచులతో సమావేశమయ్యారు. నన్నారి పెంపకంతో పాటు ఇంకా ఏమైనా కావాలని



చెంచులతో మాట్లాడుతున్న నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

చెంచులను అడుగగా అటవీ ప్రాంతం నుంచి సేకరించిన ఉత్పత్తులను అమ్ముకునేందుకు గిరిజన స్టోర్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరడంతో ఐటిడిఎ అధికారులను గిరిజన స్టోర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాన్నరి మొక్కలపై పెంపకంపై చెంచులకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు ఒక ఎకరాలో నన్నారి నర్సరీలు సాగు చేసేలా అధికారులు ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. అంతరించి పోతున్న మొక్క నాన్నరి అని, దీని కోసం చెంచులు కూడా అడవిలో చాలా దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు. అడవి నుంచి సేకరించిన కుంకుడు, చింత పండు, ఉసిరికాయలు, ముష్టిగింజలు తదితర వాటిని కొనుగోలు చేసేలా గిరిజన స్టోర్లను ఏర్పాటు చేయాలన ఐటిడిఎ అధికారులను ఆదేశించామన్నారు పిఎంవిడివికె గ్రూపులు తయారు చేసి చెంచులను చైతన్యవంతులను చేయాలని అన్నారు. చెంచుల సంక్షేమాభివృద్ధిపై అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సుబ్రమాణ్యం, ప్రాజెక్టు మేనేజర్ కెజి నాయక్, హౌసింగ్ ఏఇ, ఎన్‌ఆర్‌జిఎస్ ఏపిఓ నాగార్జున, కిశోర్, చెంచులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా ఉమామహేశ్వరుల రథోత్సవం

**బనగానపల్లెరూరల్,న్యూస్ః** ఎర్రమల్ల కొండల్లో వెలిసిన శ్రీ యాగంటి ఉమామహేశ్వరుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారంనాడు స్వామివార్ల రథోత్సవం ఆలయ ఈ.వొ బి. చంద్రుడు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ రథోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సతీమణి బి.సి ఇందిరమ్మ హాజరై పూజలు నిర్వహించిన అనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు. ముందుగా స్వామి వారికి ఆలయ ప్రాంగణంలో విశేష పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులను పల్లకిలో తీసుకొని వచ్చి రథంపై అదిష్టింపచేసి గుమ్మడికాయలు , కొబ్బెరి కాయలు



పూజలు నిర్వహిస్తున్న బి.సి ఇందిరమ్మ

సమర్పించిన అనంతరం హాజరైన అశేష భక్తజన సందోహం ఓంకార నామాల మధ్య స్వామి వారి రథం ముందుకు కదిలింది. స్వామి వారి రథం ముందు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యాగంటిపల్లె ఉప సర్పంచ్ బండి మౌళీశ్వర రెడ్డి, ఆలయ మాజీ ఛైర్మెన్ దోనపాటి యాగంటి రెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి, రామారెడ్డి, బండి కుమార్ రెడ్డి, బత్తుల నారాయణ రెడ్డి, బత్తుల భాస్కర్ రెడ్డి, బత్తుల గోపాల్ రెడ్డి, ఆలయ అర్చకులు మహేష్ శర్మ, కిశోర్ శర్మ, బనగానపల్లె సి.ఐలు ప్రవీన్ కుమార్, మంజునాథ్, ఎస్.ఐ దుగ్గిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మనస్థాపానికి గురై గృహిణి ఆత్మహత్య

**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ ః** భర్త పార్థసారథి ఆచారి తాగుడుకు బానిసై మానుకోని కారణంగా మనస్థాపానికి గురైన నాగలక్ష్మి(40) అనే గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన 4వ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నాగలక్ష్మి,పార్థసారథిలకు గత 18సం॥ల క్రితం వివాహమైంది. నాగలక్ష్మి నగరంలోని ఎస్‌వి కాంప్లెక్స్ వద్ద నున్న టాటా జ్యూవెలరీ దుకాణంలో సేల్స్ మేనేజర్‌గా పని చేస్తుంది. భర్త పార్థసారథి మెడికల్ కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. వీరికి ఒక కూతురు,ఒక కుమారుడు ఉన్నారు. గత కొంతకాలంగా పార్థసారథి తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోగా నాగలక్ష్మిని వేధిస్తుండేవాడు. అయితే రెండేళ్ల క్రితం మద్యం మానేశానని చెప్పడంతో కొంతకాలం సంసారం సజావుగా జరిగింది. వారం రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉన్న తన తల్లి శకుంతల వద్దకు నాగలక్ష్మి వెళ్లి గురువారం కర్నూలుకు తిరిగి వచ్చింది. రాత్రి ఇంటికి వచ్చే సరికి భర్త పార్థసారథి ఆచారి తాగిన మైకంలో ఉండడంతో నీవు ఇంకా మానుకోలేదా అని చిన్నపాటి గొడవ పడింది. అనంతరం తన గదిలోకి వెళ్లిన నాగలక్ష్మి ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న భర్త హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందింది. ఈ విషయాన్ని పార్థసారథి హైదరాబాద్‌లో ఉన్న అత్త శకుంతలకు సమాచారం ఇవ్వగా ఆమె కర్నూలుకు వచ్చి తన కూతురు చావుకు భార్యభర్తల మధ్య ఉన్న గొడవలే కారణమని పోలీసులకు తెలిపింది. శకుంతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు 4వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతిచెందిన నాగలక్ష్మి

# నయన పర్వంగా బుగ్గ రామేశ్వరుని రథోత్సవం







**ఓర్వకల్లు, మేజర్ న్యూస్ ః** ఓర్వకల్లు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కాల్వ బుగ్గ క్షేత్రంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన శ్రీ భ్రమరాంబ బుగ్గ రామేశ్వర స్వామి రథోత్స వం అత్యంత రమణీయంగా సాగింది. ఆలయ ఈఓ కె మద్దిలేటి ఆద్వర్యంలో నిర్వహించిన రథోత్సవ వేడుకలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ముందుగా ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందచేశారు. అనంతరం ఆది దంపత ఉత్సవ మూర్తులను నూతన పట్టు వస్త్రాలు,పూలమాలతో అలంకరించి పల్లకిలో ఆశీనులు చేశారు. వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మద్య స్వామి వార్లను ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి దంపతులు, టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, టిడిపి యువ నాయకులు గౌరు జనార్ధన్‌రెడ్డి,పరిటాల శ్రీరామ్,ఉత్సవ కమిటీ సభ్యులు, వీరశైవ సంఘం వారు నంది కోలు నాట్యం చేస్తూ స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించి రథ శాల వద్దకు చేర్చారు. ఆలయ అర్చకులు కళ్లె లక్ష్మి నారాయణ శర్మ, పురోహితులు రథోత్సవం ముందర రథాంగ బలి సమర్పించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథంపై ఆవీనులు చేశా రు. హరహర మహాదేవ అంటూ భక్తులు రథాన్ని లాగారు. భక్తులు ఆచారం ప్రకారం రథంపైకి పూలు, పండ్లు వేసి తన్మయం చెందారు. రథశాల వద్ద నుంచి బయలుదేరిన స్వాముల వారి రథం ఆలయం ఎదుట ఉన్న నంది మండపం వరకు వెళ్లి తిరిగి పూర్వ స్థానానికి చేరుకుంది. అలాగే నన్నూరు గ్రామంలో నగరేశ్వర స్వామి రథోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ కర్నూలు రూరల్ సిఐ చంద్ర బాబునాయుడు, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్‌లు పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. రథోత్సవ వేడుకల్లో మండలాధికారులు,కాల్వ బుగ్గ దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ కాటినేని నారాయణ, ఆలయ ధర్మకర్తలు,టిడిపి నాయకులు కెవి మధు,పాలకొల్లు సుధాకర్‌రెడ్డి,నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు గుట్టపాడు మోహన్‌రెడ్డి,కన్నమడకల సుధాకరయ్య,వెంకటేశ్వర్లు,కాల్వ రజాక్,మీది వేముల రామాంజనేయులు,దేవాదాయ శాఖ సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

# అమృతవల్లి అమ్మవారికి నవకలశ తిరుమంజన సేవ



అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో అమృత వల్లి అమ్మవారికి నవ కలశ తిరుమంజనం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యు లు, అర్చక బృందం అమ్మవారికి వేద మంత్రాల నడుమ అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ అహోబిల లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ముందుగా వచ్చే శుక్రవారమును సంవత్సరపు చివరి శుక్రవారం గా పరిగణిస్తారు. అందువల్ల అమృత వల్లి అమ్మవారికి నవకలశ అభిషేకం నిర్వహిస్తున్నామన్నారు.

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- జిల్లావ్యాప్తంగా 69 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- సీసీ కెమెరాల మధ్య విద్యార్థులకు పరీక్షలు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ ః** నేటి నుంచి కర్నూలు జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లావ్యాప్తంగా 69పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. ఇందులో 32ప్రభుత్వ కళాశాలలు,4 ఎయిడెడ్ కళాశాలలు,ఏపిఆర్‌జెసి ఒకటి, మోడల్‌స్కూల్ 4,37 ప్రైవేటు కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఫస్ట్ ఇయర్ 23,098మంది విద్యార్థులు మొదటిరోజు పరీక్ష రాయనున్నారు. 950మంది ఇన్‌విజిలేటర్లతో పాటు 69మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు విధులు నిర్వహించనున్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సిసి ఫుటేజ్‌లు ఏర్పాటు చేసి అధికారులు ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వార పర్యవేక్షించనున్నారు. అంతేకాకుండ సిట్టింగ్,ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో ప్రత్యేక బృందాలను సైతం అధికారులు కమిటీలను వేశారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు ఏవైన సందేహాలు వస్తే టోల్ ఫ్రీ నెం ః 08518 22247ను సంప్రదించవచ్చని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థుల కోసం ఇప్పటికే ఆర్టీసి,మున్సిపాలిటీతో పాటు ఇతర శాఖల వారు తమకు కేటాయించిన పనులను ఇప్పటికే పూర్తి చేశారు. 9గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి నిరాకరణ అనే నిబంధన స్పష్టంగా ఉంది. జిల్లావ్యాప్తంగా 7 సమస్యాత్మకమైన పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రతను సైతం ఏర్పాటు చేశారు. గతేడాది జరిగిన చిన్నపాటి ఘటనలు పునరావృతం కాకుండ అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు.

# నేర నియంత్రణే లక్ష్యంగా కృషి చేయాలి - జిల్లా ఎస్పీ

**కర్నూలు క్రైం, మేజర్ న్యూస్ ః** నేర నియంత్రణే లక్ష్యంగా ప్రతిఒక్కరు కృషి చేయాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్పీలు,సిఐలు, ఎస్‌ఐలతో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్లను ఆశ్రయించే బాధితుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. పెండింగ్ కేసులు తగ్గించాలన్నారు. కర్నూలు,పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లలో దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి ఆరాతీశారు. పోలీస్‌స్టేషన్‌ల వారిగా కేసుల పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పలు సలహాలు,సూచనలు చేశారు. ప్రజలతో పాటు పోలీస్ సిబ్బంది కూడా బైక్ నడిపేటప్పుడు లైసెన్స్‌లు,హెల్మెట్‌లు కలిగి ఉండాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్,ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి హుస్సేన్ పీరా,ఏర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్,లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డిఎస్పీలు జె బాబు ప్రసాద్,కె శ్రీనివాసాచారి, హేమలత,భాస్కర్‌రావు,ట్రైనీ డిఎస్పీ ఉషశ్రీ,సిఐలు,ఎస్‌ఐలు పాల్గొన్నారు.



పాల్గొన్న పోలీసులు

